అభ్యర్థులకు కేటాయించిన గుర్తులలో 'తరవాణీ కుండ' కూడా వుంది. దాన్ని వారు కడవ అన్నారుకాని అది తరవాణీ కుండే- వాణిశ్రీకి తరవాణిశ్రీకి పడదు. తరవాణీ కొట్టేస్తే చిన్నప్పుడు స్కూల్లో నిద్దరొచ్చేది. తరవాణీలో వూరేసిన మాగాయటెంక చీకుతూ ఈ వ్యాసం చదవండి మీకు తెలుస్తుంది. నేనెప్పుడూ తల దగ్గర దిండు కింద ఒక కాగితం పొట్లంలో రెండు ఆవకాయ పెచ్చులూ, మాగాయ ముక్కలూ, నిమ్మబద్దలూ, కొత్త చింతపండూ పెట్టుకుని నిద్దరోయేదాన్ని. మా అత్తారింట్లో నాయీ చిరుతిళ్ళు చూసి "దిగర్ల్ యీజ్ కేరీయంగ్" అని అంతా అనుకోవడం ప్రారంభించారు.

ఆపిల్ పళ్ళు తిను, దానిమ్మపళ్ళు తిను, అర్టిపళ్ళు తిను, అనాసపళ్ళుతిను, నారింజపళ్ళుతిను, కమలాలుతిను, సీతాఫలాలు తిను, రామాఫలాలు తిను, ద్రాక్షపళ్ళు తిను, అలూబకరా పళ్ళు తిను, లీచీపళ్ళు తిను, కిస్మిస్‌పళ్ళు తిను, అంతేకాని – ఈ ఆవకాయ పెచ్చులూ మాగాయ టెంకలూ తెచ్చుకుని మంచం మీద తలకింద పెట్టుకుతినడం మానేయ్ అని మావారు గొడవ చేశారు. మన సంస్కృతి గురించి ఏమీ తెలియనందుకు మావారి అజ్ఞానాన్ని క్షమిస్తూ అప్పట్నుంచీ వారు చూస్తూండగా తింటం మానేశాను. కాని నోరు మాగాయటెంక వాసనేస్తూందే అనటం మావారు మానలేదు – నేను నవ్వేసి క్షమించి పారేస్తూ వుంటాను. ఒకే మామిడిపండుని భార్యాభర్తలు ఆరగించటం ఎలా అనే విషయాన్ని గురించి వచ్చేవారం చెబుతాను.

# పాలిచ్చే తల్లి

మొన్న బస్సులో వూరెళ్ళినప్పుడు ఒక పల్లెటూరి అమ్మాయి అంతమందిలో నిర్భయంగా పవిట పక్కకు లాగి రవిక సర్ది పిల్లాడిని అడ్డం వేసుకుని పాలిస్తోంది. పైగా ఏటో ఆలోచిస్తూ పరధ్యాసగా వుంది. ఆ పిల్లడు కూడా ఒక చేత్తో తల్లితో ఆడుకుంటున్నాడు. నాకు ఒళ్ళు కంపరమెత్తింది. అంతమందిలో అలా సిగ్గు లేకుండా పాలిచ్చే తల్లిని స్త్రీజాతికే అవమానంగా భావించి మా వారు అటు చూస్తున్నారేమోనని ఆయనకేసి తిరిగాను, ఆయన అటే చూస్తూ చిరునవ్వు నవ్వుతున్నారు. "ఎందుకు నవ్వుతున్నారు, ఆ సిగ్గులేని ఆడదాన్ని చూసి" అన్నాను కొంచెం మూతి బిగించి.

"లోకోత్తరమైన దృశ్యాన్ని చూసి ఆనందిస్తున్నాను" అన్నారు ఏవీ సిగ్గులేకుండా – ఇలాటి సిగ్గులేని మొగుడితో ప్రయాణం చేస్తున్నానే అని నాకు తలబద్దలు కొట్టుకోవాలనిపించింది. లేచి వెళ్ళి ఆపల్లెటూరి మొద్దుచెంపలు ఎడా పెడా వాయించాలనుకున్నాను. చాలామంది అటే చూస్తూన్నారు – చూసీ చూడనట్లు. ఎంత బరి తెగించింది? "కొంగు మీదకు లాక్కుని అటు

తిరిగి పాలివ్వు తల్లీ" అని చెప్పాను దగ్గరకెళ్లి ఈ ఎగ్జిమిషన్ను చూడలేక. "పిల్లవాడేడుస్తాడండీ గుక్కపట్టి" అంది. వాడింకా పాలు తాగుతూ మధ్యలో అటూ ఇటూ చూస్తూ కేరింతలు కొడుతూ తల్లి రవికతో ఆడుకుంటున్నాడు.

బస్సు దిగాక మావారన్నారు - తల్లి పిల్లడికి పాలిచ్చే దృశ్యం చాలా గొప్పదనీ ప్రపంచంలో అంతకంటె గొప్ప దృశ్యం లేదు గనుక తన్మయంతో చూసి ఆనందించాననీ, పుణ్యవనీ చెప్పారు. ఓరినాయనో పుణ్య వంటున్నారు - ఇదేదో మోసంలాగుంది అనుకుని పుణ్యవెందుచేత అని ఉపనిషత్తుల్లో శిష్యుడు గురువుగార్ని అడిగినట్లు అడిగాను. "ఈ అమ్మాయ్ ఒకప్పుడు సిగ్గుపడుతూ తలుపువార నిలబడి భర్తను చూసి మధురంగా వూహించుకొని వుంటుంది."

"కావచ్చు"

"పేరంటాళ్ళు పదిమంది పట్టుకుని గదిలోకి తోసి గెడెట్టి వుంటారు అవునా?"

"పదిమందెందుకండీ రోడ్డురోలర్ని తోసినట్టు - ఒకళ్ళో ఇద్దరో చాలు."

"ఎందుచేత"

"ఎందుచేతేమిటి మొగుడి దగ్గర కెళ్ళడానికి సిగ్గుగనక-"

"సిగ్గెందుకు?"

"నా మొహం - అమ్మాయిలు సిగ్గుపడరుటండీ, గదిలో కెళ్ళేప్పుడు బ్యాట్మింటన్ కోర్టులో కెళ్ళినట్లు నడుచుకెళ్తారుటండీ?"

"వెళ్తారుగద - వెళ్ళి..."

"వెళ్ళి యివన్నీ ఎందుకడుగుతారు!"

"ఆ మొగుడ్ని ఓ పట్టాన దగ్గరకు రానివ్వరు ఎంచేత."

"ఏదో చిన్నతనం - సిగ్గు-భయం-కొత్త పైగా అంతా తెలిసిపోతుందేమోననే జంకు-ఇవన్నీ సహజాలు-"

"ఓసి వెర్రిదానా మరిప్పుడా అమ్మాయి పబ్లికు బస్సులో కూర్చుని ఒళ్ళో పిల్లడు రవికతో ఆడుకుంటూ పాలు తాగుతూంటే వాడి కిబ్బంది కలుగుతుందని యిటూ అటూ కదలకుండా పాలిస్తూంటే ఎందుకు తప్పు పడతావు?"

"మరీ అట్లానా సిగ్గు లేకుండా..."

"మొగుడి దగ్గర కెళ్ళినందుకు తప్పు బట్టవు, నవమాసాలు మోసుకుంటూ తిరిగినందుకు సిగ్గులేదని అనవు, తన మాతృత్వం సంపూర్ణమయిందని ఆనందిస్తూ పాలిస్తున్న తల్లిని చూసి సిగ్గులేని దంటావు. మీ పట్నవాసపు చదువుకున్న ఆడాళ్ళు నిజంగా స్త్రీజాతికే మచ్చ - ఏది అద్భుతమో ఏది లోకోత్తరమో దాన్నే అసహ్యించుకునే మీ లేడీస్ ఒకటో నంబరు రాస్కెల్సు, ఆవిడ వెధవ బస్సు నేవిటి ఆ పిల్లాడి కోసం లోకాన్నంతటినీ, మీ వెధవమోరల్సన్నిటినీ ధిక్కరించగలదు-"

"పోని పవిట వేసుకోకుండా అలా ధిక్కరించి నిలబడిన ఆడాళ్ళను ఆరాధిస్తో మమ్మల్ని తిట్టిపొయ్యండి. మీకళ్ళు చల్లగా వుంటాయి."

"నా కళ్ళు చల్లగా వుంటాయి - నిజవే. మీరంతా అంతే - అసలు ఆడజాతే అంత. మాతృత్వం సిద్ధించగానే రంగు మార్చేస్తారు. పిల్లడో పిల్లో కలిగేవరకే సిగ్గూ, వయ్యారం, నాజూకుతనం, నామోషీని - ఒక్క సారి కడుపు పండిందో మగాడుగానే భర్త సింహాసనం మీంచి జారి కిందపడతాడు. నువ్వు పడ్డావని ఆడది చెప్పదు, నవ్వుతూ కాలిమట్టెలు చూసుకుంటూ పిల్లాడ్ని ఒళ్ళో వేసుకుని పాలిస్తూ నీతో అవసరం తీరిందని చెప్పకుండా చెబుతుంది. అందుకే ఆ సీను అంతగొప్పగా వుంటుందని చెప్పాను."

"బావుందండీ వరస - మీ కివ్వాళేదో తిక్క పుట్టుకొచ్చింది."

"తిక్కకాదే - పురుటి సమయంలో చూడు. మగాడి అమాయకత్వం అనింపార్టెన్సు బయటపడుతుంది. ఒక స్త్రీ తను రెండయి మృత్యువుతో పోరాడేవేళ మగాడు బిక్క మొగం వేసుకుని వరండాలో పచార్లు చేస్తూ వుంటాడు. నేచర్ అంటే ప్రకృతి మగాడ్ని నిమిత్త మాత్రం చేసేసి వదిలింది. అటువంటి ఆడది మృత్యువును జయించి ఒక పసికందుని తెచ్చుకుని ఎంతో గర్వంతో పాలిస్తూ కళ్ళుమూసుకుని పాలిస్తూ ఆనందిస్తూంటే - ఆవిడ్ని సిగ్గు లేనిదని అవమానించే నీ బోటి నాగరిక యువతుల్ని తన్నాలి."

"అహ అల్లాగ, చాలావరకూ వెళ్ళిందే వ్యవహారం! పోనీ ఆడజన్మ ఎత్తి పురుళ్ళ వార్డులో నర్సుగా చేరరాదూ - పుణ్యం వస్తుంది మీకు."

"నాకేం అభ్యంతరంలేదు కాని-"

"కాని ఏవిటి?"

"నేను ఆడజన్మ నెత్తితే నర్సు కాకుండానే పురుళ్ళవార్డుకి వెళ్ళాల్సి వస్తుంది కదా-"

"అవును అప్పుడేనా మీపాలిచ్చే తల్లి కోరిక నెరవేరుతుందనుకుంటా-"

"అనుకో-కాని బస్సులో నువ్వు ఎదురుగా వుంటావే-"

"వుంటాను కాని అప్పుడు నేను పాలిచ్చే తల్లి లోకోత్తర దృశ్యాల్ని చూసి మీకుమల్లే మహత్తరంగా ఆనందిస్తా ననుకున్నారా?"

"మరి నువ్వు పరపురుషుడి వేషం వెయ్యవా?"

"వెయ్యను. మీకు ఆడబడుచుగా పుట్టి పవిట సరిగా వుంచుకో నందుకు ఆ లెంపా ఈ లెంపా వాయగొడతాను."

"మరి ఆ బస్సులోకి నువ్ ఎల్లా వస్తావ్?"

"మీరు బిడ్డని కని పాలియ్యగా లేంది నేనా బస్సులోకే రాలేనా? ఎంత పిచ్చివారండీ-"